

ఆసిఫాబాద్ టౌన్ : ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

# భక్తిశ్రద్ధలతో బక్రీద్


మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో సోమవారం బక్రీద్ వేడుకలను ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులు, ఈద్గాలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సామూహిక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు సందేశాలు ఇచ్చారు. బక్రీద్ పండగ విశిష్టతను తెలియజేశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఖుర్బానీ చేసి పేదలకు దానం చేశారు. బంధువులు, ఆత్మీయులను ఇళ్లకు పిలిచి విందు ఇచ్చారు. పలుచోట్ల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



మందమర్రి : ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



మంచిర్యాల ఏసీసీ : ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు



మంచిర్యాల ఏసీసీ : ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

## నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

దహెగాం,జూన్17 : హత్తిని గ్రామంలో సోమవారం 124 కిలోల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు. గ్లైసిల్ పత్తి విత్తనాలు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు మనోజ్‌రావు ఇంటికి వెళ్లి చూడగా, బండి సింహాద్రి ట్రాక్టర్‌లో పత్తి వితనాల బ్యాగులు లోడ్ చేస్తున్నాడు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకొని పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి రాజులునాయుడికి సమాచారమివ్వగా, వచ్చి పంచనామా చేశారు. పట్టుబడ్డ విత్తనాల విలువ రూ.3.10 లక్షల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. మనోజ్‌రావు, బండి సింహాద్రిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



పట్టుబడ్డ నకిలీ విత్తనాలతో ఎస్ఐ రాజు, ఏవో రాజులునాయుడు



కోటపల్లి : నక్కలపల్లి వాగు వరదలో నుంచి గర్భిణిని తీసుకెళ్తున్న 108 సిబ్బంది, గ్రామస్తులు (ఫైల్)

● వర్షాలు రావొద్దు దేవుడా..



కోటపల్లి : పారుపల్లి-లింగన్నపేట గ్రామాల మధ్య నిర్మిస్తున్న బ్రిడ్జి పక్కన తాత్కాలిక రోడ్డు

# వానకాలమంటే వణుకే

## మారుమూల గ్రామాలకు మెరుగుపడని రవాణా వ్యవస్థ

- రోడ్లు, వంతెనలు లేక దశాబ్దాలుగా అష్టకష్టాలు
- చిన్నపాటి వర్షాలకే వాగులు ఉప్పొంగి రాకపోకలు బంద్
- రోజుల తరబడి బాహ్య ప్రపంచంతో సంబంధాలు కట్
- చెన్నూర్, బెలంపల్లి నియోజకవర్గాల్లో 80కిపైగా బ్రిడ్జిలు నిర్మించిన కేసీఆర్ సర్కారు
- కాంగ్రెస్ ప్రభుత్వంలో ముందుకు కదలని అనేక పనులు

మంచిర్యాల, జూన్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : జిల్లాలోని మారుమూల గ్రామాల ప్రజలకు వర్షాకాలమంటేనే వణుకు. వాగులు.. వంకలు ఉప్పొంగి బాహ్యప్రపంచంతో రోజుల తరబడి సంబంధాలు తెగిపోతాయనేది వారి భయం. ఒక్కసారి భారీ వాన పడిందా ఇక దినదిన గండమే. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల వాసులంతా 'వానలు రావద్దు దేవుడా'.. అని కోరుకుంటుంటారు. దశాబ్దాలుగా అనేక గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన కేసీఆర్ సర్కారు రవాణా వ్యవస్థ మెరుగుపర్చాలని నిర్ణయించింది. ఈ మేరకు అనేక గ్రామాలకు రోడ్లు, వంతెనలు నిర్మించింది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల్లో 80కి పైగా వాగులు, వంకలపై బ్రిడ్జిలు నిర్మించడమేగాక మరికొన్ని గ్రామాలకు నిధులు కూడా మంజూరు చేసింది. అయితే, అటవీ అనుమతులు లేక నిర్మాణాల్లో జాప్యం జరిగింది. ఇక ఆపై అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మారుమూల గ్రామాలకు రోడ్లు, బ్రిడ్జిలు నిర్మించాలన్న విషయాన్నే పట్టించుకోవడం లేదు. దీంతో ఈ యేడాది కూడా ఆయా గ్రామాల ప్రజలకు తిప్పలు తప్పేలా లేవు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఇటీవల కోటపల్లి మండలం రాజారం గ్రామపంచాయతీ ప్రజలు పార్లమెంట్ ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చిన విషయం విదితమే. చివరకు అధికారులు దిగివచ్చి చర్చలు జరపడంతో వారంతా నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. నక్కలపల్లి గ్రామానికి రోడ్డు వేసేందుకు నిధులు మంజూరైనా అటవీశాఖ అనుమతులు లేక రోడ్డు, వాగుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడం లేదు. ఇక పారుపల్లి-లింగన్నపేట గ్రామాల మధ్యనున్న వాగుపై రూ.3 కోట్ల 8 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం చేపడుతుండగా, నేటికీ పనులు పూర్తి చేయలేదు. దీంతో ఈ మార్గంలో ఉన్న 10 గ్రామాల ప్రజలకు కష్టాలు తప్పేలా లేవు.

### వర్షం వస్తే రాజారం ఊరికెళ్లడం కష్టమే

ఈ వానకాలంలో కూడా రాజారం గ్రామస్తులకు కష్టాలు తప్పేలా లేవు. రాజారం గ్రామానికి రెండు మార్గాలుండగా, కేసీఆర్ ప్రభుత్వం పారుపల్లి నుంచి కావరకొత్తపల్లి గ్రామం వరకు ఉన్న 5 కిలో మీటర్ల రోడ్డుకు రూ.3 కోట్ల 3 లక్షలు, బబ్బెరచెలుక నుంచి రాజారం వరకు 3 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 2 కోట్ల 3 లక్షలు మంజూరు చేయించింది. కాగా, అటవీ అనుమతులు లేని కారణంగా ఈ రోడ్డు పనులు నిలిచిపోగా గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం ఈ మార్గం మొత్తం బురదమయం అవుతుండడంతో కాలినడక కూడా కష్టం అవుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. 1125 మంది గ్రామస్తులు ఉండే ఈ గ్రామం పై చిన్నచూపు చూస్తుండడం వల్ల తమకు వర్షాకాలంలో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయని చెబుతున్నారు. ఈ గ్రామంలోని విద్యార్థులు పై చదువులు చదవాలంటే ఊరికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బబ్బెరచెలుక గ్రామానికి కాలినడకన వెళ్లాల్సి వస్తుంది. ఈ మార్గంలో వాగు ఉండడం వల్ల, అది ఉప్పొంగినప్పుడల్లా ప్రాణాలకు తెగించి స్కూల్‌కు వెళ్లాల్సి వస్తున్నదని విద్యార్థులు చెబుతున్నారు.



కోటపల్లి మండలం రాజారం రోడ్డు

### అటవీ అనుమతులే అడ్డంకి

కోటపల్లి మండలం నక్కలపల్లికి రోడ్డు నిర్మాణానికి అటవీ అనుమతులే ప్రధాన అడ్డంకిగా నిలిచాయి. మల్లంపేట నుంచి నక్కలపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.6 కోట్లు, మార్గమధ్యలో ఉన్న వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ. 2.95 కోట్లు, మరో బ్రిడ్జికి రూ.2 కోట్ల 3 లక్షలను కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేయగా, అటవీ అనుమతులు లేక రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణం పడకేశాయి. గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న మట్టి రోడ్డు వర్షాకాలం బురదమయం కావడంతో వర్షాకాలం నక్కలపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాలతో పాటు బద్దంపల్లి, చాపనపల్లి, బొమ్మెన గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. వర్షాలు పడితే ఈ మార్గంలో ఉన్న వాగులు ఉప్పొంగితే రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి ఎక్కడివారక్కడే ఉండాల్సి వస్తోంది. రోడ్డు, వాగుల పైన బ్రిడ్జిల నిర్మాణం పూర్తయితే ఈ మార్గంలో ఉన్న ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది.

### బ్రిడ్జి పూర్తికాకుంటే కష్టమే..

కోటపల్లి మండలం పారుపల్లి-లింగన్నపేట గ్రామాల మధ్య ఒర్రెపై రూ.3 కోట్ల 8 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు. ఇది పూర్తి కాకపోతే అవతల ఉన్న 10 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఉంది. బ్రిడ్జి పక్క నుంచి తాత్కాలిక రహదారి ఏర్పాటు చేసినప్పటికీ వర్షం పడితే బురదమయమైన ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ మార్గంలో లింగన్నపేట, ఎదుల్లబంధం, సిర్సా, పుల్లగామ, ఆలుగామ, రొయ్యలపల్లి, జనగామ, నందరాంపల్లి, సూపాక, వెంచపల్లి గ్రామాలు ఉండగా, ఈ రోడ్డు ద్వారానే రాకపోకలు సాగుతున్నాయి. బ్రిడ్జి నిర్మాణ పనులు నెమ్మదిగా కొనసాగితే... వర్షాలు పడి తాత్కాలిక రోడ్డు బురదమయమయితే ఎటు వాహనాలు అటే ఉండాల్సిన పరిస్థితి ఎదురుకానుంది. ప్రస్తుతం చిన్న వర్షం పడినా ఈ గ్రామానికి ఆర్టీసీ బస్సు సేవలు నిలిచిపోతున్నాయి.

### వాగు ఉప్పొంగితే అంతే..



*మా ఊరికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో మస్తు తిప్పలైతంది. మా బడి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. మొత్తం 30 మంది విద్యార్థులం నడుచుకుంట బడికి వెళ్తం. చిన్నపాటి వర్షం పడినా మా ఊరి వాగు ఉప్పొంగుతది. నీళ్లు పారినన్ని రోజులు బడికి బందే. ఎన్నోసార్లు వాగు తగ్గే దాకా ఒడ్డువద్ద గంటల తరబడి ఎదురు చూసినం. ఇకనైనా సార్లు కల్పించుకొని మా ఊరి రోడ్డు తొందరగా పూర్తి చేయాలి. అప్పుడే మా కష్టాలు తీరుతయి.*

**- వైష్ణవి, విద్యార్థిని, రాజారం**

### తొందరగా పనులు పూర్తి చేయాలి



*మా ఊరికి రోడ్డు, బ్రిడ్జి నిర్మించేందుకు ఎప్పుడో నిధులు మంజూరైనయి. అటవీశాఖ అనుమతులు లేక పనులు చేస్తలేరు. దీంతో మా ఊరితో పాటు పక్కనే ఉన్న గ్రామాల ప్రజలు కూడా మస్తు తిప్పల పడుతున్నరు. వాగులు ఉప్పొంగితే గంటల తరబడి ఎక్కడి జనాలు అక్కడే ఉండాల్సి వస్తుంది. రోడ్డు, వాగుల పైన బ్రిడ్జి లేకపోవడంతో మా గ్రామానికి అత్యవసర పరిస్థితులలో 108 అంబులెన్స్ కూడా రాని పరిస్థితి ఉంది. ఇకనైనా సార్లు చొరవ తీసుకొని తొందరగా పనులు పూర్తి చేయాలి.*

**- ఈగం లచ్చయ్య, నక్కలపల్లి**



అమ్మవారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

## బాసర క్షేత్రం.. జనసంద్రం

బాసర, జూన్ 17 : నిర్మల్ జిల్లా బాసర పుణ్యక్షేత్రం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. వరుస సెలవుల నేపథ్యంలో వేలాది మంది తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పిల్లలకు అక్షరశ్రీకార పూజలు చేయించారు. మహారాష్ట్ర మాజీ సీఎం, బీజేపీ రాజ్యసభ సభ్యుడు అశోక్‌రావు చౌహాన్ సతీసమేతంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అర్చకుడు




మంచిర్యాలలో నివాళులర్పిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

## సహస్రకు వాకర్స్ అసోసియేషన్ నివాళి

మంచిర్యాలటౌన్, జూన్ 17 : పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో ఈ నెల 13న ఆరేండ్ల చిన్నారి సహస్రను హత్యాచారం చేసిన మృగాడిని కఠినంగా శిక్షించాలని మంచిర్యాల రాముని చెరువు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక రాముని చెరువుకట్టపై చిన్నారి సహస్ర చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. సహస్ర ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి, బెల్ట్ షాపులు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, ఉపాధ్యక్షులు రాజేందర్ రెడ్డి, భాస్కర్ రావు, బూర్ల జ్ఞాని, సలహాదారులు డాక్టర్ త్రినాథరావు, డాక్టర్ సల్మాన్ రాజ్, సత్యనారాయణమూర్తి, వీర శంకర్, సిరిపురం శ్రీనివాస్, మొగిలి, రామస్వామి, జగన్, ప్రసాద్, కార్యవర్గ సభ్యుడు సందీప్, మల్లేశ్, రమణ, సురేందర్, కమల్ సింగ్ పాల్గొన్నారు.

### బాలిక కుటుంబాన్ని ఆదుకుంటాం

దహెగాం, జూన్17 : హత్యకు గురైన బాలిక కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావుతో కలిసి సోమవారం బాలిక చిత్రపటానికి నివాళులర్పించారు. చిన్నారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. రూ. 25 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్, చింతలమానెపల్లి ఎంపీపీ డుబ్బుల నానయ్య, దహెగాం వైస్ ఎంపీపీ చౌదరి సురేశ్, నాయకులు కంభగౌని సంతోష్‌గౌడ్, బండ కృష్ణమూర్తి పాల్గొన్నారు.



బాలిక కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

## మంచిర్యాల డీసీపీ, ఆసిఫాబాద్ ఎస్పీ బదిలీ

### కొత్త డీసీపీగా భాస్కర్, ఎస్పీగా శ్రీనివాస్‌రావు



బదిలీపై వెళ్తున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ సురేశ్‌కుమార్



బదిలీపై వెళ్తున్న మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్

కుమ్రం భీం ఆసిఫాబాద్(నమస్తే తెలంగాణ)/ఆసిఫాబాద్ టౌన్/మంచిర్యాల ఏసీసీ, జూన్ 17: ఎన్నికల కోడ్ ముగియడంతో ప్రభుత్వం పెద్ద ఎత్తున ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు చేపడుతున్నది. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా 28 మంది ఐపీఎస్‌లను బదిలీ చేయగా, ఇందులో మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్‌ను జగిత్యాల ఎస్పీగా, కుమ్రం భీం ఎస్పీ సురేశ్‌కుమార్‌ను బాలానగర్ డీసీపీగా బదిలీ చేసింది. మేడ్చల్ డీసీపీ డీవీ శ్రీనివాస్ రావును ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీగా నియమించింది. హైదరాబాద్ ఎస్పీ, తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరోగా విధులు నిర్వహిస్తున్న ఏ.భాస్కర్‌ను మంచిర్యాల డీసీపీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2019 బ్యాచ్‌కు చెందిన అశోక్‌కుమార్ మార్చి 2న మంచిర్యాల డీసీపీగా బాధ్యతలు స్వీకరించారు. గత అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఇటీవల నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించడంలో ఎస్పీ సురేశ్‌కుమార్ సక్సెస్ అయ్యారు. సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువయ్యారు.



కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీగా బదిలీపై వస్తున్న శ్రీనివాస్ రావు



మంచిర్యాల డీసీపీగా బదిలీపై వస్తున్న భాస్కర్

## బదిలీ అయిన కలెక్టర్‌కు సన్మానం



కలెక్టర్ బదావత్ సంతోష్‌ను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్, డీపీవో వెంకటేశ్వర్లు, ఎంపీవోలు

నస్పూర్, జూన్ 17 : స్థానిక కలెక్టరేట్‌లో మంచిర్యాల జిల్లా కలెక్టర్‌గా పనిచేసి నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయిన బదావత్ సంతోష్‌ను సోమవారం టీఎన్‌జీవో నాయకులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి రామ్మోహన్, పొన్న మల్లయ్య, బాపురావు, శ్రీనివాస్, తిరుపతి, శ్రావణ్, గోపాల్, సుమన్, సప్దర్ అలీ పాల్గొన్నారు. ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ బదావత్ సంతోష్‌ను జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, డీపీవో వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఎంపీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు బాపురావు, డీఎల్‌పీవో సప్దర్ ఆలీ, ఎంపీవోలు సత్యనారాయణ, నాగరాజు,కార్యదర్శులు శ్రావణ్, సుమన్, శ్రీనివాస్, నవ్య, క్రాంతి పాల్గొన్నారు. అలాగే డీఎంహెచ్‌వో అనిత, విశ్వేశ్వర్‌రెడ్డి, మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్, చారి, సాయి బదావత్ సంతోష్‌ను సన్మానించారు.



కలెక్టర్ సంతోష్‌ను సన్మానిస్తున్న టీఎన్‌జీవో నాయకులు


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహా మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..

ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571

మంచిర్యాల జిల్లా : 9182 777 676

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679